# అసలు సగం

ఇరవైయేళ్ళు ఇతర రాష్ట్రాల్లోనూ, పదిహేనేళ్ళు ఢిల్లీలోనూ ఉద్యోగం చేశాను. ఇన్నేళ్ళకిన్నేళ్ళకి సొంత రాష్ట్రానికి ప్రయాణం పెట్టుకున్నాను. పెళ్ళిచేసుకోకుండా, నలుగురు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లెళ్ళ భాధ్యతలు నిర్వర్తించాను. వారంతా జీవితంలో స్థిరపడి హాయిగా వున్నారు. నేనే ఒంటరిగా మిగిలిపోయాను.

పుట్టి పెరిగిన ఊరినీ, తిరిగిన ప్రదేశాల్నీ, ఆనాటి మిత్రుల్నీ ఒక్కసారి చూసిరావాలని ఒక తీపి కోరిక. వాడని బాల్య పరిమళాల్ని వెంటాడే కౌమారపు జ్ఞాపకాల్నీ ఆఘ్రాణించాలని ఒక మధురవాంఛ

నెలరోజుల ముందునుంచే హడావిడి. నిలువనీయని ఒక ఆరాటం. అక్కడా ఇక్కడా ఉన్నారని విన్న మిత్రుల ఫోన్ నెంబర్ల కోసం ఒక వెంపర్లాట. కొంత ఫలం దక్కింది. హైదరాబాద్‌లో కొందరి ఫోన్ నంబర్లు దొరికాయి.

సచ్చిదానందం పలికాడు. వాడూ నేనూ ఒకటో తరగతినుంచీ ఏడువరకే కలిసి చదువుకున్నాం. ఒకసారి పడవల కాలవలో ఈతకొడుతూ, అలుపుతో మునకలేస్తున్నాడు. ఒడ్డున తలతుడుచుకుంటున్న నేను చూశాను. చప్పున కాలవలోకి దూకి వాణ్ణి బయటకి లాగాను.

వాళ్లమ్మా, నాన్న నన్ను ఆకాశానికెత్తేశారు. ఇదిజరిగిన నెలలోపే, వాళ్ళకేదో బంగారం దొరికిందనే పుకారు రేగింది. ఆ వెంటనే ఆ కుటుంబం ఆ నాటి మద్రాస్‌కి వెళ్ళిపోయింది. సచ్చిదానందంతో నా స్నేహానికి తెర దిగింది. ఇన్నేళ్ళకి వాడి మాట మళ్ళీ విన్నాను.

సచ్చిదానందం ఇప్పుడు హైదరాబాద్‌లోని ఎంఎస్ఐ గ్రూప్‌కి ఛైర్మన్‌గ అండ్ ఎండీ. పెద్ద బిజినెస్ మాగ్నెట్. "రాగానే మా ఆఫీస్‌కి రా కలుసుకుందాం" అని అడ్రస్ వివరాలు చెప్పాడు.

చక్రవర్తి నెంబరూ తెలిసింది. ఫోన్ చేశాను. వాడు అమెరికా వెళ్ళాట్ట. అతని భార్య శకుంతల మాట్లాడింది. "ఆయనగారికెప్పుడూ సెమినార్లూ, టూర్లూ, ఎప్పుడొస్తారో ఏమో. రాగానే చెప్తానులెండి" అన్నది.

ఆమె మాటల్లో ఏదో మార్మిక వేదన ధ్వనించింది.

చక్రవర్తీ నేనూ తొమ్మిదీ, పదీ, ఎస్సెసెల్సీ కలిసి చదివాం. మా బృందంలో వాడు చాలా తెలివైనవాడు. అందుకే ప్రొఫెసర్ కాగలిగాడు. జాతీయంగా అంతర్జాతీయంగా చాలా పేరు గడించాట్ట.

సుబ్బారావూ హైదరాబాద్‌లోనే వున్నాడు. ఏజీ ఆఫీస్‌లో రిటైరయి, అక్కడే స్థిరపడ్డాడు. ప్రస్తుతం ఛానెళ్ళనీ ఇరగదీస్తున్నాను., మన సీరియల్ స్క్రిప్టులతో జనం ఛస్తున్నారు" అని సరదాగా మాట్లాడాడు. ఆనాటి చలాకీ తనమే వుంది మాటల్లో.

తర్వాత, ప్రసాదంతో మాట్లాడాను. వాడిప్పుడు పెద్ద జనరల్‌సర్జనట. "ఈ ఊరు రాగానే ముందు ఫోన్ చేసిరా" అన్నాడు.

ప్రయాణం తేదీ దగ్గరపడుతోంది. నాలో ఒక ఉద్విగ్నత, లోలోపల ఒక ఉత్సాహం, ఒక ఉద్వేదం.

ఆ వేళ ఏప్రిల్ 17వ తేదీ. ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి, మర్నాడు రాత్రికి హైదరాబాద్ చేరాను. హోటల్లో బస. ఆ రాత్రంతా కలతనిద్ర.

తెల్లవారింది. ఉషోదయం ఆహ్లాదంగా ఉంది. కిటికీ తెర తొలగించి బయటకి చూశాను. హైదరాబాద్ స్కైలైన్ అద్భుతంగా ఉంది. సుందర నగరం భాగ్యనగరం.

హుస్సేన్‌సాగర్‌లో బుద్ధుడు తన మృదుల హస్తంతో విశ్వప్రేమని చాటుతున్నాడు. స్నానాదికాలు, బ్రేక్‌ఫాస్ట్ పూర్తిచేసేసరికి పదిగంటలు కావస్తోంది. ఆటోలో జూబ్లీ హిల్స్‌కి బయల్దేరాను. ఎంఎస్ఐ గ్రూప్ ఆఫీస్‌కి

సచ్చిదానందం ఆఫీస్‌కి చేరేసరికి పదీనలభై. అతను రమ్మన్న సమయానికి ఇంకా ఇరవై నిముషాలుంది. నేను వెళ్ళేసరికి రిసెప్షన్‌లో ఒక యువతీ యువకుడూ వున్నారు. నేనూ నా విజిటింగ్ కార్డ్‌ని లోపలికి పంపాను.

రిసెప్షన్ హాలు చల్లగా ఉంది. నిశ్శబ్దంగా ఉంది. గ్రానైట్ ఫ్లోరింగ్‌తో, వాల్ పేపర్లతో ఖరీదుగా ఉంది. టీపాయ్‌మీది మేగజైన్ తీసుకున్నాను.

మంచినీళ్ళ గ్లాసూ, వేడి కాఫీ కప్పు, పక్కన మరో కప్‌లో షుగర్ క్యూబ్స్,., ట్రేని నా ముందుంచాడు బాయ్.నీళ్ళు తాగి కాఫీ తీసుకున్నాను. పక్కనున్న యువతీ యువకుడూ తగ్గుస్వరంతో తమలో తాము మాట్లాడుకుంటున్నారు. నాకు వినిపిస్తోంది విషయం.

"ఈయన స్టింజీ ఫెలో. రేట్‌ని గీసిగీసి నెగోషియేట్ చేస్తాడు జాగ్రత్త" చెప్పింది యువతి.

"యా... కోట్లు కోట్లు సంపాదించి కీప్ కొడుక్కిస్తున్నాట్ట. జాతక ప్రభావం – అది వాడి అదృష్టం" అంటూ నర్మగర్భంగా నవ్వేడు యువకుడు. నేను గతుక్కుమన్నాను.

జీవితంలో కొన్ని ఊహించని మలుపులు ఇలాగే తటస్థపడతాయి. మనకు రుచించని మాటలూ వినపడతాయి. ఒకరి ఇష్టాయిష్టాలతో ప్రమేయమేమీ వుండదు. లోపలినుంచీ వాళ్ళిద్దరికీ పిలుపొచ్చింది. వెళ్ళారు. వెళ్ళబోతూ ఇద్దరూ కాగితాలూ, దుస్తులూ సర్దుకున్నారు. చూపులతో పరస్పరం జాగ్రత్త చెప్పుకున్నారు. ఏదో ఆర్డర్‌కోసం వచ్చిన మార్కెటింగ్ మనుషులు అనిపించింది.

దినపత్రికని చేతిలోకి తీసుకున్నాను.

పదినిమిషాల్లో వాళ్ళిద్దరూ బయటకు వచ్చారు. మొహాలు విజయగర్వంతో వెలిగిపోతున్నై. కళ్ళల్లో కాంతీ, కాళ్ళల్లో కొత్త ఉత్సాహమూ.... యువకుడు నాకేసి చూస్తూ "థాంక్స్" అంటూ వెళ్ళిపోయాడు. యువతీ అతని వెనగ్గా కదిలింది. నాకెందుకో థాంక్స్?! నవ్వుకున్నాను.

ఇద్దరు ముగ్గురు ఫైల్స్ పట్టుకుని హడావిడిగా లోపలికి వెళ్ళారు. నాకు పిలుపు రాలేదు. ఉత్కంఠతో చూస్తూ కూచున్నాను. బాయ్ వచ్చాడు. కాఫీ ట్రే తీసుకున్నాడు. అతనివైపు "నా సంగతేమిటన్నట్టు చూశాను.

"బోర్డ్ మీటింగ్ సార్. ఆ హాలు ఈఛాంబర్‌కి అటు వైపుంది. మెంబర్స్ ఎప్పుడో వచ్చారు. ఈ సార్ కోసం వెయిట్ చేస్తున్నారు" అన్నాడు.

తామమీటింగ్‌కి వెళ్ళేలోగా సచ్చిదానందం నన్ను పిలుస్తాడనే ఆశ. పిలవకపోవచ్చునన్న నిరుత్సాహపు ఊహ. బాయ్ వెళ్ళిపోయాడు.

సమయం గడుస్తోంది. పదకొండున్నర. పన్నెండు, పన్నెండున్నర. ఒంటిగంట.. ఒకటిన్నర., మనసులో కలవరంగా వుంది. బాధగానూ వుంది. కడుపులో ఆకలవుతున్నట్టూ వుంది. దిక్కులు చూస్తున్నాను.

లోపలికి పిలుపొచ్చింది. తొట్రుపడ్డాను. "మా సచ్చిదానందాని చూడబోతున్నాను' తనువునీ, మనసునీ నిబ్బరించుకుని లోపలికి వెళ్ళాను. సచ్చిదానందం! ఎన్నాళ్ళకెన్నాళ్ళకీ?

"కమ్... కమ్..."

మనిషి నిండుగా వున్నాడు. పొట్ట పైపైకి వస్తున్న 'టై' కోటు, కళ్ళజోడు, ఒత్తు జుట్టు... చాలా సంపన్నంగా వున్నాడు. నేను కూచున్నాను.

మరుక్షణం లేచి నిలబడ్డాడు సచ్చిదానందం. టేబుల్‌మీది ఫైలేదో తీసి బ్రీఫ్‌లో పెట్టుకున్నాడు.

"నేను ముంబై ఫ్లైట్ అందుకోవాలి. టైమైంది. వారం పదిరోజులకి కానీ రాను. ఈసారి తీరిగ్గా కలుద్దాం..." అంటూ బజర్ నొక్కాడు. లేడీ సెక్రటరీ వచ్చి బ్రీఫ్ అందుకుంది.

ఆమెని చూస్తూ, "ప్లీజ్ అరేంజ్ సమ్ లంచ్ ఫర్ హిమ్" అని పురమాయించాడు. నాతోనేమో "లంచ్ చేసి వెళ్ళు" అన్నాడు. వెనకవైపునువ డోర్‌లో నుంచీ బయటికి వెళ్ళిపోయాడు. "సీ...యూ..." అంటూ.

బయటకి వచ్చి ఒక్కక్షణం నీరసంగా నిలబడ్డాను. మరుక్షణం చకచకా మెట్లమీదనుంచీ కిందికి వచ్చేశాను. బిల్డింగ్ ఆవరణ దాటి. ఆటోలో పడ్డాను. నా హోటల్ పేరు చెప్పి వెనక్కి వాలి కళ్ళుమూసుకున్నాను. అప్రయత్నంగా ఏడుపు ముంచుకొచ్చింది. 'సచ్చిదానందం ఎదిగిపోయాడు'. కంట్లోదుమ్ము పడినట్లయింది. కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు.

హోటల్ రూమ్ చేరేసరికి కిచెన్ క్లోజయిందన్నారు. జరిగిన ఘటన అప్రియమైంది కదా– మనసు పరిపరివిధాల ఆలోచనలతో సతమతమైంది.

అయినా ఆ రాత్రి – మనసు నిలవక చక్రవర్తి ఫక్షన్‌కి కాల్ చేశాను. ఆయన భార్యే! పేరు చెప్పాను. తన ఉక్కు శబ్దాల్ని విడిపించిందామె. 'ఇంకా రాలేదండీ ఆయన, నేను చెప్తానన్నాగా?" ఫోన్‌ని తానే కట్ చేసింది.

'నయీ మంజిల్ , నయీ రాహేం!' కలతనిద్రలో తలపులు పల్టీలు కొడుతూనే వున్నై.

మర్నాడు ఉదయాన్నే, నాకు నేనే గుడ్‌మార్నింగ్ చెప్పుకుని సుబ్బారావుకి ఫోన్ కొట్టాను. స్విచ్ ఆఫ్‌చేసి వుందని గురగురలాడిందో ఆడగొంతు.

టైమ్ చూస్తే ఎనిమిదిన్నర. ప్రసాదం కళ్ళముందు కొచ్చాడు. మనసు ద్వైదీభావంతో నిండివుంది. అయినా తెగించి సెల్ నొక్కాను. 'ఇవ్వాళ వేరే హాస్పటల్‌లో ఉన్నాను. ఎవరో పిల్లకి ట్యాన్సిల్స్ తీసేయాలిట. చాలా బిజీ. మనం కలుసుకోలేం" అని. "ఈ హాస్పటల్స్ నన్నిలా వేధిస్తూనే వుంటాయి గానీ, నేనే ఢిల్లీ వస్తానో వారంరోజులు.. జస్ట్ ఫర్ ఛేంజ్" అని తన పనిలో పడ్డాడు.

విషయాలన్నీ సందిగ్ధ స్పృహతో మొదలై, స్పష్టమైన అప్రియాలుగా ముందుకొచ్చాయి. మనుషులు కాలపరిధిని దాటి పనిచేస్తున్నారు. మానవాతీత అకర్షణ దేనిమీదనో గుడ్డి గౌరవం పెరిగిపోయింది. సంభాషణలు వివరించలేని క్రియలు – మనుషుల మనసుల్నీ, జీవిత ప్రాధమ్యాల్నీ పట్టి చూపుతున్నాయి.

కొత్త ప్రయత్నాలు అనవసరం . హైదరాబాద్ నామీద నిరాశా ఛత్రాన్ని పట్టింది అనే ఎరుక కలిగింది. నగరమూ, నగరంలో మనుషులూ 'భౌతికం' అయ్యారనే తెలివిడీ కలిగింది. ఆ సాయంత్రమే బయల్దేరి విజయవాడ చేరాను. రాత్రి పన్నెండయింది. ముందుగానే రిజర్వ్ చేసుకున్న హోటల్ రూమ్ సిద్ధంగా ఉంది.

ఓ కప్పు వేడిపాలు తాగి విశ్రమించాను.

ఐదున్నరకే భళ్లున తెల్లారింది. నగరం ఒళ్ళు విరుచుకుంటోంది. మార్నింగ్ వాక్‌కి బయటికి వచ్చాను.

బందరు రోడ్. ఇవ్వాళ ఎం.జీ.రోడ్.నగరవాలకంతో పెద్దదై కనిపిస్తోంది. నవ్విన ఊళ్ళే పట్నాలవుతాయి. పట్నాలు నగరాలవుతాయి. విజయవాడ విస్తృతమైంది. ఆ రోజుల్లో బెంజ్ సర్కిల్ నుంచీ లీలామహల్‌దాకా అలవోకగా నడిచేవాళ్ళం. ఇవాళ... నా వల్లకాదు. వయస్సు తెచ్చిన మార్పు. ఇక్కడి మిత్రుల ఫోన్ నెంబర్లేవీ దొరకలేదు. నేను చూడవలసింది ఒక్క రంగబాబునే. నా ఆత్మీయమిత్రుడు. టీచర్‌గా ఇక్కడే స్థిరపడ్డాడు. సరాసరి ఆ ఇంటికి వెళ్లటమే.

బ్రేక్‌ఫాస్ట్ పూర్తిచేసి, ఆటోలో మారుతీ వ్యాయామశాల దగ్గరికి వెళ్ళాను. ఆ పక్కవీధిలోనే రంగబాబు ఇల్లు. తేలిగ్గానే గుర్తుపట్టాను. అదే దాబా ఇల్లు. మరికొంచెం పాతబడినట్లు నిలిచి ఉంది. చెక్కగేటు, ఎండకీ వానకీ చివికిపోయి వుంది. లోపలికి నడిచాను.

లో వాకిట్లో మొక్కలూ, చెట్లూ!

ఉక్కపోస్తున్నది. మూగ ఎండ కాస్తోంది.

నా రాకని గమనించి ఇంట్లోనుంచీ బయటకి వచ్చాడాయన. ఏభైఏళ్ళ మనిషి, స్ఫురద్రూపం. రంగబాబు పోలికలు. "రండి" అంటూ సాదరంగా ఆహ్వానించాడు. కుర్చీ తెచ్చి జామచెట్టుకింద వేశాడు . కూచున్నాను. పదిహేను పదహారేళ్ళ పిల్ల మంచినీళ్ళ గ్లాస్ తెచ్చి "నమస్తే" అంటూనే, నీళ్ళగ్లాస్‌ని అందించింది.

'అనూరాధ, మా అమ్మాయి" అని, "నేను రంగబాబుగారి అబ్బాయిని. మౌళిని. మీరు సత్యమూర్తిగారు. నేను గుర్తుపట్టాను. మీలో పెద్ద మార్పులేదు" అని నవ్వాడు. నాకు సంతోషం కలిగింది. ఇంతలో అతను "సీతా" అంటూ కేకేశాడు. నాతోనే "నా భార్య" అన్నాడు.

సీత వచ్చింది. అప్పటికే ఆమె పూజాదికాలైనట్లున్నై. పవిత్రస్ఫూర్తిని ప్రస్తారం చేస్తూ ప్రసన్నంగా వుంది. నవ్వు మొహం. తులసికోటలో నీళ్ళుపోసి వస్తున్నట్టుంది. చేతిలో రాగి పంచపాత్ర వుంది. "నమస్కారం' అంది.

"వీరు సత్యమూర్తిగారు. నాన్నగారి బాల్యమిత్రులు" ఆమె 'అలాగా' అన్నట్లు తల ఊపింది.

మౌళి స్టూలుమీద కూర్చుని తన గురించి చెప్పాడు. ఏదో స్కూల్లో నాన్ టీచింగ్‌లో సీనియర్ అసిస్టెంటు. "నాన్నగారు లేరు. మా చెల్లెలు దగ్గరికెళ్ళారు. ఫర్వాలేదు. మీరిక్కడే వుండొచ్చు. లేదా మీకు హోటలే సౌకర్యంగా వుంటే. సరే" అని "చెప్పండి" అన్నాడు.

నేను నా రాక అంతర్యాన్నీ, నా కోరికనీ చెప్పాను. "నేను సెలవు పెడతాను. మీరు ఎక్కడెక్కడికి వెళ్ళాలనుకుంటారో, ఎవరెవర్ని కలవాలో చెప్పండి. నేనూ మీతో వస్తాను. ఏమీ ఇబ్బంది లేదు. కారు తీసుకుందాం. ట్రావెల్స్‌లో ఫ్రెండున్నాడు" అని భరోసాగా చెప్పాడు మౌళి.

మౌళి మాటతీరుకీ, ఆదరణకీ చాలా సంతోషం కలిగింది. చీకట్లో చిరుదివ్వెని చేతికందించినట్లైంది నాకు. సీత లోపలికి వెళ్ళింది. నేనూ మౌళీ పాత సంగతులు మాట్లాడుతూ కూచున్నాం.

కాఫీ వచ్చింది తాగాం.

భోజనానికి నన్ను బయటకి వెళ్ళనీయలేదు. మౌళీ, సీతా. రెండుగంటలవుతుండగా నన్ను తన స్కూటర్ మీద హోటల్ దగ్గర దింపాడు మౌళి. "నేను హోటల్లోనే ఉంటాన్లే మౌళీ" అన్నాను. అతను సరేనన్నాడు.

నవ్వుతూ, "యథా సౌకర్యం" అనీ అన్నాడు.

సాయంత్రం నాలుగవుతుండగా కారు తీసుకుని వచ్చాడు మౌళి. టీ తాగి తెనాలి బయల్దేరాం. పుట్టి పదహారేళ్ళు పెరిగిన ఊరు. కనకదుర్గమ్మ వారధి, నేషనల్ హైవే. అన్నీ కొత్తగా ఉన్నై. పెదవడ్లపూడి బ్రిడ్జి కొత్తగా వచ్చింది. అక్కణ్ణుంచీ కాలువ కట్టమీద పోతోంది కారు. నేను నా చిన్నప్పటి అభిమానమైన పాట ఎత్తుకున్నాను- "ఏటిపడవసరంగు పాట గిరికీలలో ..." అంటూ

మౌళి చాలా ఆనందించాడు. ఆ తర్వాత తెలుగు సాహిత్యం గురించి మాట్లాడుకున్నాం. తుమ్మపూడి దాటుతుండగా చెప్పాను నేనూ, రంగబాబూ కలిసి ఎన్నిసార్లు సంజీవదేవ్ గారింట్లో ఆతిథ్యం స్వీకరించిందీ, ఆ కథలూ మా జ్ఞాపకాలూ వివరించాను. తెనాలి పాత వంతెన దగ్గర అదే సందడి. రద్దీ. ఇప్పుడూ అట్టాగే ఉంది.

ముందుగా సాంబశివరావుని చూద్దామనిపించింది. వాడు నాకు ఎస్సెసెల్సీలో ప్రథమ శత్రువు - మార్కుల దృష్ట్యా. పబ్లిక్‌లో చివరికి రెండు మార్కులు ఎక్కువ సాధించాను నేను. వాళ్ళ నాన్నగారానాడు బహుమతిగా ఇచ్చిన 'గైడర్' బంగారు పాళీకలం. ఈ నాటికీ ఒక అపురూప సంపద నాకు! కొత్తపేట వెళ్ళాము.

వాళ్ళిల్లు ఉన్నచోట నీ పాత ఆనవాలూ లేదు. నాలుగంతస్థుల కొత్త బిల్డింగ్ వచ్చింది. పాతికేళ్ళ క్రితమే అమ్మేసి వైజాగ్ వెళ్ళిపోయారట. ఆ బిల్డింగ్‌లో హిస్పటల్ నడుస్తోంది. మేమూ విషయాలు మాట్లాడుతుంటే ఓపీ నుంచీ వయసుమళ్ళిన మనిషి మా ముందుకు వచ్చాడు. నా వైపు తేరిపార చూశాడు.

అతని కళ్ళు మెరిశాయి. అతని మొహంలో ఒక వికాసం పొడసూపింది. 'నువ్వు... మీరు' అంటూ తడబడుతూ, ఆశ్చర్య సంభ్రమాలతో, "సత్యం... నేను..

నేను వెంకటేశ్వర్లువిరా"అంటూ ఆప్యాయంగా ముందడుగు వేసి కావలించుకున్నాడు.

కళ్ళు వర్షించినై. మాటలు కట్టువడినై. ఆ పరస్పర ఉద్వేగంలో. ఉత్సాహంలో ప్రాణం హాయిగా తేలిపోతోంది. ఒకరి భుజాన్ని ఒకరం తట్టుకుంటూ, మందుకోసం వచ్చాను. ఫర్వాలేదు, ఇప్పుడింక దాని అవసరం లేనట్టయిపోయింది. పద.. ఇంటికి వెళ్దాం" అని కదిలాడు.

మారీస్ పేటలో వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్ళాం. పాత కాలం నాటి చిన్న మిద్దె. ఒక్కడూ ఉంటున్నాడు. ఉన్న ఒక్క కొడుకూ, కోడలూ దుబాయ్ వెళ్ళారు. వాళ్ళకి పిల్లల్లేరు. తనకున్న రెండెకరాల పొలంతో పడుతున్న అవస్థలేవో చెప్పుకొచ్చాడు.

డబ్బాల్లో వున్న లడ్డూ బూందీ పెట్టాడు. వద్దంటుంటే వినకుండా కాఫీ చేసిచ్చాడు. తానూ తీసుకున్నాడు. ఆ తర్వాత ముగ్గురమూ కలిసి నడుచుకుంటూ ఆ కాలంలో మేమున్న ఇంటికి వెళ్ళాం. ఆస్థలంలో ఎవరో పొన్నూరు వాళ్ళు మూడంతస్తుల భవంతిని వేశారు.

నాలుగుబజార్లూ చుట్టబెట్టాం. పాతమొహమూ తటస్థపడలేదు. నిరాశగా వెనుదిరిగాం. వెంకటేశ్వర్లు దగ్గర సెలవు తీసుకుని కదిలాం - నేనూ, మౌళి.

వైకుంఠపురం చూసి, గుంటూరు చేరాం. అక్కడా నాకు తెలిసినవారు కొందరుండేవారు. రామన్నాసక్షేత్రం, పట్టాభిపురం, పాతగుంటూరు, కొత్తపేట, బ్రాడీపేట.. ఏమిటో పిచ్చి... అన్ని రోడ్లూ కొలిచాము.

అక్కడక్కడా ఎవరో వుండాలి. కానీ ఆ ఇళ్ళని వెతకాలనిపించలేదు. శంకర విలాస్‌లో కాఫీ తాగాం. ఆనాటి శోభ ఏదీ? ఆనాటిరుచి మాత్రం ఏదీ? మార్పు దానిలోనా, నాలోనా? బాహ్యవాతావరణంలోనా, ఆంతరిక ఆవరణం లోనా? నాలో నాకే చాలా ప్రశ్నలు.

విజయవాడ తిరిగొచ్చేసరికి చాలా పొద్దుపోయింది. మర్నాడుఉదయాన్నే కారు తీసుకుని తయారయ్యాడు మౌళి. దుర్గగుడి చూసిన తర్వాత శ్రీకాకుళం వెళ్ళాం. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం. దైవదర్శనం అయినై. కూచిపూడి, మొవ్వ చూశాము. బందరు వెళ్ళి ఏదో హోటల్లో భోజనం ముగించాం. మంగినపూడి, శివగంగ చూసి విజయవాడ చేరాం.

రూమ్‌లో పడుకుని ఆలోచిస్తున్నాను. విహారయాత్ర లేదా క్షేత్రదర్శనం బాగానే వుంది. కానీ, మనసు ప్రశాంతంగా లేదు. ఏదో అసంతృప్తి. కలగాపులగంగా తలపులు. ఎప్పటికో కునుకుపట్టింది.

బాగాపొద్దెక్కి లేచాను. పదిదాటిన తర్వాత వచ్చాడు మౌళి. స్కూటర్‌మీద తన ఇంటికి తీసుకెళ్ళాడు. 'ఇవ్వాళ మా ఇంటి భోజనం' అన్నాడు నవ్వుతూ. సీత నన్ను స్వాగతించి తన పనిలో నిమగ్నమైంది.

మౌళీ, నేనూ, అనురాధా మాటల్లో పడ్డాము.

"అవునయ్యా, నాన్నతో మాట్లాడనేలేదు, ఫోన్ కొట్టు" అన్నాను మాటలమధ్యలో. "నిన్నా ఇవ్వాళా చేస్తూనే వున్నాను సార్. వాళ్ళు కాశీ యాత్రలో వుండి వుంటారు. అందుకనే లైన్ కలవటం లేదు" అన్నాడు.

నేను దిగులు మొహం పెట్టాను. అనురాధ చదువు సంగతులూ, లోకాభిరామాయణం మాటల్లో కదిలాయి.

భోజనానికి కూచున్నాం. సాదరంగా వడ్డిస్తోంది సీత. "వేప పువ్వు పచ్చడీ, క్యారెట్ హల్వా మావయ్యగారికి చాలా ఇష్టం. అవ్వే మీకూ ఇష్టమని చెప్పారీయన. అవే స్పెషల్ ఈ పూట" అన్నది సీత. వాటిని నా విస్తట్లో వేస్తూ, నేను కొంచెం ఆశ్చర్యపోయాను. ఏనాటి రుచులు అవి?' అనే ఆలోచనలతో భోజనం అయింది.

హాల్లో కూచున్నాం. నా చదువంటే చాలా ఇంట్రెస్ట్ తాతయ్యకు. ఐయామ్ అన్‌ఫార్చునేట్. ఐ మిస్ హిమ్" అన్నది అనూరాధ. గుండె చిక్కబట్టింది నాకు. అదిరిపోయాను. శూన్య దృక్కుల్ని చూస్తూ మౌళి కళ్ళల్లో గుచ్చాను. "అవును సార్. నాన్నగారు చనిపోయి ఏడాది దాటింది" మౌళి కంఠం రుద్ధమైంది,

నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తున్నాను. నా కళ్ళముందు సచ్చిదానందం, చక్రవర్తి, సుబ్బారావు, ప్రసాదం...! అప్పుడు వెంకటేశ్వర్లు! ఇప్పుడు...? కానరాని రంగబాబూ, ఎదురుగా మౌళి! తండ్రి బాల్యమిత్రుణ్ణి ఆదరించీ, అభిమానించీ, విస్తరేసి అన్నం పెట్టిన 'మనిషి' లోకరీతిలో బొమ్మా -బొరుసూ.

హఠాత్తుగా నాకేదో జ్ఞానోదయమైంది. ఇన్నేళ్ళు నేను కోల్పోయిందేమిటో తెలిసొచ్చింది. నాకేం కావాలో అర్థమైంది. శేషజీవితమంతా నేను మనషుల్లో ఉండాలి. "మౌళీ, నాకు మీ దగ్గర్లో ఓ ఇల్లు చూడవయ్యా" అన్నాను.

చల్లగా కమ్మతెమ్మెర సోకింది.

ప్రాణం హాయిగా ఉంది.

-స్వాతి సపరివారపత్రిక, 6-7-2012